# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు బిల్‌గేట్స్ తో సమావేశమయ్యారు.
- ❖ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుండి ఈరోజు భూమిపైకి తిరిగి వచ్చిన వ్యోమగామి సునీత విలియమ్స్ బృందానికి శాసనసభ అభినందనలు తెలిపింది.
- ❖ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హెల్మెట్ ధరించని వారినుంచి జరిమానా వసూలు చేస్తున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.
- ❖ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతిస్తోందని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.
- ❖ ఉపాధ్యాయ బదిలీల క్రమబద్ధీకరణ బిల్లుకు శాసనమండలి ఈరోజు ఆమోదం తెలిపింది.

=========================

స్వర్ణ ఆంధ్రప్రదేశ్-2047 దార్శనికతను సాకారం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్‌గేట్స్ తో ముఖ్యమంత్రి ఈ రోజు సమావేశమయ్యారు. ఢిల్లీలో సుమారు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. అనంతరం బిల్‌గేట్స్‌తో జరిగిన చర్చలకు సంబంధించిన వివరాలను సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వంతో గేట్స్ ఫౌండేషన్ సహకారంపై కీలక చర్చలు జరిపామని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, ఉపాధి కల్పన వంటి కీలక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల వినియోగంపై చర్చించామన్నారు. గేట్స్ ఫౌండేషన్‌తో ఈ భాగస్వామ్యం ప్రజల శ్రేయస్సు కోసమేనని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పురోగతికి మద్దతు ఇచ్చినందుకు బిల్ గేట్స్ కు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

=========================

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఈరోజు ఉభయ సభలు సమావేశమయ్యాయి. శాసనసభ కార్యకలాపాలను సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలతో ప్రారంభించారు. అంతకు ముందు ఈరోజు తెల్లవారు జామున అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుండి భూమిపైకి తిరిగి వచ్చిన వ్యోమగామి సునీత విలియమ్స్ బృందానికి శాసనసభ అభినందనలు తెలిపింది. సునీత విలియమ్స్ భూమిపైకి సురక్షితంగా తిరిగి రావటం శుభపరిణామమని, అంతరిక్ష యాత్రలో ఆమె ప్రస్థానం స్ఫూర్తిదాయకమని అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ...

(వాయిస్ 18 సెకన్లు)

========================

ప్రజల ప్రాణాలు కాపాడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈ రోజు శాసనమండలి లో హెల్మెట్లు ధరించని వారి నుంచి వెయ్యి రూపాయల జరిమానా వసూలు చేయడం పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉందని తెలుగు దేశం పార్టీకి చెందిన శాసనమండలి సభ్యులు ప్రస్తావించిన అంశానికి హోంమంత్రి స్పందిస్తూ... 2020లో కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే రాష్ట్రంలో జరిమానా వసూలు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్నిచోట్ల మాత్రమే ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేస్తున్నామని చెప్పారు.

========================

ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతిస్తోందని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఈ రోజు శాసనసభలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ యూనిట్లను మంజూరు చేసిందని, అందులో భాగంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఒక క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరయ్యిందని తెలిపారు. అలాగే తెనాలిలో 100 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ యూనిట్లను త్వరలో నెలకొల్పనున్నామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

========================

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఉపాధ్యాయ బదిలీల క్రమబద్ధీకరణ బిల్లుకు శాసన మండలి ఈరోజు ఆమోదం తెలిపింది. అలాగే 2025-26 సంవత్సరానికి సంబంధించిన ద్రవ్య వినిమయ బిల్లుకు సైతం ఆమోదం లభించింది. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాలన స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ మహానగర పాలక పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థల సవరణ బిల్లుకు కూడా శాసనమండలి ఆమోదం తెలిపింది.

========================

విశాఖ స్టీల్‌ప్లాంట్ భూసేకరణ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అంశంపై శాసనసభలో ఈరోజు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానమిచ్చారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో మిగిలిపోయిన వారికి త్వరలో న్యాయం చేస్తామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.

విరామం

========================

అమరావతి ప్రాజెక్టుకు మొత్తం 31 వేల కోట్ల రూపాయలను కేటాయించామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతికి కేంద్ర ప్రభుత్వ సహాయంపై శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. రాజధాని పనులు ప్రారంభించడానికి బడ్జెట్ లో 6 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులు అమరావతికి వాడకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారని

మంత్రి తెలియజేశారు.  రాజధాని కోసం తీసుకున్న రుణాలను అమరావతి పూర్తయిన తర్వాత తిరిగి చెల్లిస్తామని మంత్రి నారాయణ మాట్లాడుతూ…

(వాయిస్ 34 సెకన్లు)

========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపటి నుంచి రెండు రోజుల పాటు  తిరుమలలో పర్యటించనున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో టీటీడీ అదనపు కార్యనిర్వాహణ అధికారి సి.హెచ్.వెంకయ్య చౌదరి ఈ రోజు తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ విజిలెన్స్, ఇంజినీరింగ్, అన్న ప్రసాదం అధికారులతో ముఖ్యమంత్రి పర్యటనకు చేయాల్సిన ఏర్పాట్లపై పలు ఆయన సూచనలు చేశారు. అనంతరం అన్న ప్రసాదం నాణ్యత, రుచిపై భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

========================

భూముల రీసర్వే ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ రోజు జిల్లాలోని నకరికల్లు మండలంలో కలెక్టర్ పర్యటించారు. నకరికల్లు మండలం కండ్లకుంట గ్రామంలో చేపడుతున్న భూముల రే సర్వే ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి భూముల రీ సర్వే ప్రక్రియపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

========================

హస్త కళాకారులను ప్రజలు ప్రోత్సాహించాలని చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత కోరారు. ఈ రోజు శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు  మంత్రి సమాధానమిస్తూ… బొబ్బిలి వీణ తయారీదారులకు ప్రభుత్వం అండగా వుంటుందని హామీ ఇచ్చారు. వీణ తయారీకి 30 సంవత్సరాల పనస చెట్టు కలప మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో పనస చెట్ల పెంపకానికి కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి పనస కలప కొనుగోలు చేసి వీణ తయారీదారులకు అందించడానికి చర్యలు చేపట్టానున్నామని మంత్రి తెలియజేస్తూ…

(వాయిస్ 26 సెకన్లు)

========================

తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై మూడోదశ విచారణ కలెక్టరేట్ లో జస్టిస్ సత్యనారాయణ మూర్తి సమక్షంలో ఈరోజు కూడా కొనసాగింది. తిరుపతి జిల్లా మాజీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుబ్బారాయుడు, టీటీడీ గోశాల డైరెక్టర్ హరినాథ్, మాజీ సివిఎస్వో శ్రీధర్, మాజీ డిఎస్పీ రమణ, నలుగురు సిఐలు, ఆరుగురు ఎస్ ఐలు, నలబై మంది హోం గార్డులు సహా ఇతర సిబ్బందిని అందరినీ ఒకేసారి విచారిస్తున్నారు.

========================

ఆంధ్రప్రదేశ్ లోని బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలంలోని మోటుపల్లి, పెద గంజాం గ్రామాల మధ్య తీర ప్రాంతంలో గ్రీన్ ఫీల్డ్ పోర్టు, నౌకా తయారీ కేంద్రాన్ని స్థాపించాలని కోరుతూ కేంద్ర ఓడరేవులు, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ కు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో ఈరోజు జరిగిన 4వ జాతీయ సాగరమాల అపెక్స్ కమిటీ సమావేశంలో కేంద్రమంత్రిని కలిసి ఈ వినతి పత్రం అందించారు.

========================

========================